క్లుప్తంగా

14న మండల సమావేశం

రాయచోటి అర్బన్ : ఈనెల 14వ తేదీన రాయచోటి రూరల్ మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ సురేంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సభా భవనంలో బుధవారం ఉదయం 10గంటలకు ఎంపీపీ పల్లపు రాజమ్మ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. సమావేశంలో మండలంలో వివిధ శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధిపై సమీక్ష జరుగుతుందన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తదితరులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ఎంఈఓలకు సన్మానం



ఎంఈఓ పద్మజను సన్మానిస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : అపుస్మ ఆధ్వర్యంలో గురువారం ఎంఈఓ కార్యాలయంలో మండల విద్యాధికారులు పద్మజ, రెడ్డయ్యలను ఘనంగా సన్మానించారు. ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్‌లు, జిల్లా సెక్రటరీ రాజశేఖర్, కోడూరు వైస్ ప్రెసిడెంట్ సత్యకుమార్, జిల్లా జాయింట్ సెక్రటరీ తోట యువరాజ, మండల విద్యాధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి అన్ని విధాల సహాయ సహకారాలు అందించినందుకు కృతజ్ఞతగా విద్యాధికారులను సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైకోట సిద్ధార్థ పాఠశాల కరస్పాండెంట్ మహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి



ఉమామహేశ్వరరావు, ఎంపీడీఓ

సిద్దవటం : మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం ఆవరణలో శుక్రవారం జరుగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యాక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులు, బీపీ, షుగర్, కీళ్ల నొప్పులు, జనరల్ వ్యాధులకు సంబంధించి పేషెంట్లు ప్రతి ఒక్కరూ వైద్యులచే పరీక్షలు చేయించుకొని ఉచితంగా మందులను పొందాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొని విజయవంతం చేయాలని తెలియజేశారు.

సత్ప్రవర్తన కలిగి ఉండాలి



యువకులకు కౌన్సెలింగ్ సీఐ పురుషోత్తంరాజు

సిద్దవటం : అందరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఒంటిమిట్ట సీఐ పురుషోత్తంరాజు తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని గాంధీ వీధిలో బుధవారం రాత్రి యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా యువత బైక్ నడిపేటప్పుడు వేగంగా వెళ్లడం మానుకోవాలన్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు పాల్పడకుండా స్నేహపూర్వంగా ఉండాలన్నారు. ఎవరైనా గ్రామంలోకి కొత్త వ్యక్తులు వచ్చినట్లయితే పోలీసులకు సమాచారం తెలపాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పెద్ద ఓబన్న, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యతగా పాఠశాల నిర్మాణ పనులు



తల్లెంవారిపల్లె జెడ్పీహెచ్ఎస్ పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ శేషగిరి రావు

ఓబులవారిపల్లె : గాదెల పంచాయతీ తల్లెంవారిపల్లెలో యుద్ధప్రాతిపదికన నిర్వహిస్తున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నిర్మాణ పనులను తహసీల్దార్ శేషగిరిరావు పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శేషగిరిరావు మాట్లాడుతూ అటవీ గ్రామం శివారున పేద విద్యార్థుల కోసం ఉన్నత పాఠశాలను నిర్మించడం హర్షనీయమన్నారు. నిర్మాణ పనులు నాణ్యతగా జరుగుతున్నాయని అన్నారు. అనంతరం పాఠశాలలో నూతన తరగతి గదులను పరిశీలించారు. దాదాపు రూ. 3 కోట్లతో నిర్మిస్తున్న నూతన భవనాల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ రామ్మోహన్, అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

సంబేపల్లె : దుద్యాల పంచాయతీలోని వడ్డిపల్లె సమీపంలో పేకాటరాయుళ్లను సంబేపల్లె పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు గ్రామంలో పేకాట ఆడుతున్నారని సమాచారంతో గురువారం పేకాట స్థావరాలపై దాడి చేసి ఆరుగురు వ్యక్తులతోపాటు వారి దగ్గర నుంచి రూ. 2700లు నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించుకోవాలి

మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులకు మాజీ ఎంపీపీ జనార్దన్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రభాకర్‌లు సూచన



సర్వసభ్యకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రభాకర్

రామాపురం : గ్రామాలలో ఎలాంటి సమస్యలు లేకుండా పరిష్కరించుకోవాలని గ్రామ సచివాలయ ఉద్యోగులకు, ప్రజాప్రతినిధులకు మాజీ ఎంపీపీ జనార్దన్‌రెడ్డి, ఎంపీడీఓ ప్రభాకర్‌లు తెలయజేశారు. మండల ప్రజా పరిషత్ సభా భవనంలో గురువారం మండల సర్వసభ సమావేశం ఎంపీడీఓ ప్రభాకర్ అధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాలలో ఉండే సమస్యలను ప్రజాప్రతినిధులు అధికారుల దృష్టికి తీసుకెళ్లి గ్రామస్థాయిలో పరిష్కరించాలన్నారు. మండలంలో నాడు – నేడు పనులు పాఠశాలలో జరుగుతున్నాయని, ప్రస్తుతం నిధులు లేక పనులు ఆగిపోయాయని ఎంఈఓ – 2 జయచంద్ర సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ మండలంలో ఇళ్ల నిర్మించుకున్న వారికి ఉపాధి బిల్లులు రాలేదని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయంపై త్వరలో లబ్ధిదారులకు ఉపాధి బిల్లులు వచ్చే విధంగా చూడాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. మండలంలో ప్రస్తుతం చేస్తున్న భూ రీ సర్వేలో ఏ గ్రామంలో చూసినా రైతులకు అన్యాయం జరిగిందని సక్రంగా భూ రీసర్వేలో జాయింట్ నెంబర్లు సర్వేల పేరుతో రెవెన్యూ సిబ్బంది రీ సర్వే సక్రమంగా చేయలేదని రైతులు లబోదిబోమంటున్నారని పలువురు సభ్యులు తెలియజేశారు. సీహెచ్ఓ ఇలియాస్ మాట్లాడుతూ మండలంలో 60ఏళ్లు నిండిన వృద్ధులకు క్షయవ్యాధి రాకుండా ప్రభుత్వం ముందు జాగ్రత్తగా చర్యలుగా గ్రామాలలో మందులు పంపిణీ చేస్తున్నామన్నారు.

వ్యవసాయ అధికారి నాగమణి మాట్లాడుతూ రైతులు రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు పంట నమోదుతోపాటు ఈకేవైసీ 15వ తేదీలోపు ఆయా గ్రామ సచివాలయాల్లో రైతులు నమోదు చేసుకోవాలని ఆమె అన్నారు. ఈకేవైసీ చేసుకున్న వారికి ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక సహాయం అందుతుందన్నారు. రానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సంబంధించి పాఠశాలలో విద్యార్థులకు ముందుగా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని విద్యాశాఖ అధికారులు అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్య గణనీయంగా పెరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పాఠశాలలో నాడు – నేడు కింద ఎంపికైయ్యాయని వాటి మరమ్మతులు చేయుటకు నిధులు లేక ఆగిపోయాయని పలువురు ప్రజాప్రతినిధులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వ పథకాలను గ్రామస్థాయిలో అధికారులు ఆయా గ్రామాల సర్పంచ్ ఎంపీటీసీ కలిసి ప్రజల వద్దకు తీసుకెళ్లి వారికి పథకాల గురించి వివరించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు సక్రమమైన పౌష్టికాహారం అందించడం లేదని ప్రభుత్వం నుంచి వచ్చే పౌష్టికాహారం సక్రమంగా లేదని సభ్యులు తెలిపారు.

రాచపల్లె గ్రామం మంగళపల్లె అంగన్‌వాడీ కేంద్రాన్ని మూసివేయాలని సీడీపీఓకు సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాలను గ్రామస్థాయి అధికారులు, ఎంపీటీసీలు వారానికి రెండు మార్లు తనిఖీ చేయాలన్నారు. ఏపీఓ సురేంద్రారెడ్డి మాట్లాడుతూ 2024 సంవత్సరానికి సంబంధించి మామిడి మొక్కలు నాటుకున్న రైతులను గుర్తించామని, త్వరలో జూన్, జులై నెలల్లో ప్లాంటేషన్ కూడా పూర్తి చేస్తామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ వెంకటరమణ, మండల ఉపాధ్యక్షులు రవిశంకర్‌రెడ్డి, సర్పంచ్‌లు సంఘం అధ్యక్షుడు అయోధ్యపురం భూషణ్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షులు పెద్దిరెడ్డి, తహసీల్దార్ అరవింద్‌కిషోర్, రేఖం నారాయణ, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

జైత్ర'యాత్ర'



సెయింట్ లూయిస్‌లో యాత్ర-2 సంబరాలు నిర్వహిస్తున్న యూఎస్ఏ కో-కన్వీనరు కిరణ్ చిల్లా

రాజంపేట : అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో యాత్ర – 2 విడుదల సంబరాలను గురువారం ఘనంగా నిర్వహించారు. నగరంలో కారు ర్యాలీ చేపట్టారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టినట్లు వైఎస్సార్‌సీపీ యూఎస్ఏ సోషల్ మీడియా కో – కన్వీనరు కిరణ్ చిల్లా తెలిపారు. యాత్ర – 2 సినిమాకు యూఎస్ఏలో అనూహ్య స్పందన లభించిందన్నారు. సినిమాలో దివంగత సీఎం వైఎస్సార్, ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిల పాత్రధారులు అద్భుతంగా నటించారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమని స్పష్టీకరించారు.

మెస్ ప్రారంభం

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం బాలికల వసతిగృహంలో నూతన మెస్ డైనింగ్ హాల్‌ను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డితో కలసి గురువారం ప్రారంభించారు.

నిధులను అభివృద్ధి పనులకు వినియోగించాలి



మాట్లాడుతున్న పంచాయతీ అధికారిణి ధనలక్ష్మి

చిన్నమండెం : ప్రభుత్వం మంజూరు చేసిన 15వ ఫైనాన్స్ నిధులను మండల వ్యాప్తంగా పలు అభివృద్ధి పనులకు వినియోగించాలని జిల్లా పంచాయతీ అధికారిణి ధనలక్ష్మి తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ సభా భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డీపీఓ మాట్లాడారు. మంజూరైన నిధులను వీధి లైట్లు, బల్బులు, క్లాప్ మిత్ర జీతాలు తదితర వాటికి ఖర్చు చేయాలన్నారు. అదే విధంగా మరో విడత నిధులు మార్చి నెలాఖరులోగా విడులవుతాయన్నారు. సర్పంచుల సహకారం తీసుకొని మండల వ్యాప్తంగా పలు అభివృద్ధి పనులకు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ, ఆర్‌పీ అష్రఫ్ అలీ, ఈఓపీఆర్‌డీ పవన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ టోర్నీ విజేత సెయింట్ జోసెఫ్ స్కూల్



హోరాహోరీగా తలపడుతున్న జట్లు

నందలూరు(రాజంపేట) : స్వర్ణాంధ్ర మదర్ ల్యాండ్ విక్టరీ సంస్థ 25వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఆ సంస్థ అధ్యక్షులు వేపగుంట శ్యామ్‌రాజ్ ఆధ్వర్యంలో పార్లమెంట్ స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీలలో స్థానిక సెయింట్ జోసెఫ్ పాఠశాల ప్రథమ, ద్వితీయ బహుమతులను కైవసం చేసుకుంది. గురువారం అరవపల్లెలోని నందలూరు జెడ్పీహెచ్ఎస్ క్రీడా మైదానంలో జరిగిన కబడ్డీ పోటీల్లో దాదాపు 12 జట్లు పాల్గొన్నాయి. రాష్ట్రపతి అవార్డు గ్రహీత, విశ్రాంత లోకో పైలట్ షేక్ కమాల్ బాషా ఈ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా బుల్లెట్ హరి, శాంత కుమార్, అజయ్, హరిబాబులు వ్యవహరించారు.

కుష్టు వ్యాధి నివారణకు సహకరించండి



కుష్టువ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి రూప

ఓబులవారిపల్లె : కుష్టువ్యాధి నివారణకు అందరూ సహకరించాలని వైద్యాధికారిణి రూప అన్నారు. గురువారం మంగంపేట ఉప ఆరోగ్య కేంద్రంలో కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యాధికారిణి మాట్లాడుతూ వ్యాధి నివారణ మందులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. కుష్టువ్యాధి సోకిన వెంటనే చికిత్స చేయించుకోవాలని, చర్మంపై మచ్చలు రావడం, ఎరుపు రంగులో కాలిపోయిన మచ్చలు రావడం, చర్మంపై బుడపులు చెవి, ముఖం, కాళ్లపై వచ్చినప్పుడు గుర్తించి వెంటనే వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కుష్టువ్యాధి మైకో బ్యాక్టీరియా వల్ల సోకుతుందని, ఈ వ్యాధి చర్మానికి, నరాలకు సోకుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ లాలస, హెల్త్ అసిస్టెంట్ రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం చేస్తే కఠిన చర్యలు



సమీక్ష నిర్వహిస్తున్న డీపీఈ శ్రీనివాస్ బాబు

రాజంపేట రూరల్ : విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ శాఖ విజిలెన్సు విభాగం పర్యవేక్షక ఇంజనీర్ డీపీఈ(తిరుపతి) శ్రీనివాస్ బాబు హెచ్చరించారు. స్థానిక నార్త్ విద్యుత్ శాఖ కార్యాలయంలో విద్యుత్ శాఖ సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నార్త్ సెక్షన్ సిబ్బందికి సూచనలు, సలహాలు చేశారు. అనంతరం రాజంపేట టౌన్‌లో, పుల్లంపేట మండలం పాపక్కగారిపల్లి, అనంతరాజుపల్లి, బోటుమీదపల్లెల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. వీటిలో అడిషనల్ లోడ్ 17కు గాను రూ. 55 వేలు, విద్యుత్ చౌర్యం కేసులు 14కుగాను రూ. 1,05,000, ఇతర చౌర్యం కేసులు మూడుకు గాను రూ. 14 వేలు జరిమానాలు విధించారు. ఈ తనిఖీలలో కడప డీపీ సిబ్బంది, రాజంపేట సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం



మాట్లాడుతున్న ఏకుల రాజేశ్వరిరెడ్డి

సిద్దవటం : వైఎస్సార్‌సీపీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందని ఆ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి ఏకుల రాజేశ్వరిరెడ్డి అన్నారు. సిద్దవటం మండలంలోని పెద్దపల్లి దిగువ హరిజనవాడలో గురువారం సాయంత్రం గ్రామస్తులు శాలువాతో ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గడప గడపకు సంక్షేమ ఫలాలు వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రజలకు నవరత్నాల పేరిట పేదలు జగనన్న ఇళ్లు, వైఎస్ఆర్ ఫించన్ కానుక, వైఎస్సార్ చేయూత, అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, కాపు నేస్తం, నేతన్న నేస్తం, రైతు భరోసా వంటి సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ సమ్మెను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రమణయ్య

పెనగలూరు (ఓబులవారిపల్లె) : ఈనెల 16వ తేదీన దేశవ్యాప్త కార్మికుల గ్రామీణ సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర నాయకులు గుజ్జుల రమణయ్య కోరారు. గురువారం పెనగలూరు సీపీఐ – ఎంఎల్ కార్యాలయంలో జిల్లా సభ్యులు తిప్పన ప్రసాద్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కార్మిక, కర్షకుల వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16న దేశవ్యాప్త సమ్మెను చేపట్టనున్నట్లు వారు తెలిపారు. కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలని, సమాన పనికి సమానవేతనం కల్పించినట్లైతే కార్మికుల జీవనానికి సరిపోతుందన్నారు. కార్మిక వ్యతిరేఖ చట్టాలను 4 కోడ్‌లుగా చేయడాన్ని ఉపసంహరించాలని ఆయన కోరారు. 8 గంటల పనిని 12 గంటలకు పెంచడం సరికాదన్నారు. అలాగే అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని ఆయన కోరారు. ఉపాధి హామీ చట్టాన్ని బలోపేతం చేసి పట్టణాలకు కూడా విస్తరించాలన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం జిల్లా సమితి అధ్యక్షులు సిగి చెన్నయ్య, తిప్పన ప్రసాద్, ఇతర నాయకులు పాల్గొన్నారు.

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

రాయచోటి అర్బన్ : ప్రజారోగ్య పరిరక్షణకు అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన పట్టణ పారిశుద్ధ్యంపై ఆయన పారిశుద్ధ్య, పర్యావరణ కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విష జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో దోమల నివారణకు అవసరమైన అన్నిరకాల చర్యలను యుద్ధప్రాతిపదికన తీసుకోవాలంటూ ఆదేశించారు. పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే విషయంలో నిత్యం అప్రమత్తతతో మెలగాలని ఆయన వార్డు శానిటేషన్ కార్యదర్శులకు సూచించారు. పట్టణంలో దోమల నివారణకు మలాథిన్ స్ప్రే చేయాలన్నారు. మురుగునీటి కాలువలు, నిల్వలలో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేయించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలంటూ ఆదేశించారు. ప్రతి దుకాణాదారుడు ట్రేడ్ లైసెన్స్ తప్పక తీసుకోవాలంటూ కోరారు. సమీక్షలో మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కొండయ్యతోపాటు పలువురు వార్డు పారిశుద్ధ్య, పర్యావరణ కార్యదర్శులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి



మాట్లాడుతున్న ఎంవీఐ వినోద్ కుమార్

నందలూరు(రాజంపేట) : ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని రాజంపేట మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వినోద్ కుమార్, ఎస్ఐ మహమ్మద్ జహీర్‌లు తెలిపారు. జాతీయ 35వ భద్రతా మాసోత్సవాలు సందర్భంగా గురువారం నందలూరు షాదీఖానాలో ఆటో డ్రైవర్లకు, సుమో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, లైసెన్సులు తప్పనిసరిగా ఉండాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. అలా చేస్తే రూ. 10 వేలు జరిమానా విధిస్తామని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఆటో డ్రైవర్లు ఓవర్ లోడ్ ఎక్కించుకోరాదని, లైసెన్సు, ఆర్‌సీ, ఇన్సురెన్సు, ఫిట్‌నెస్, పొల్యూషన్ అన్ని పత్రాలు ఉండాలన్నారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ సిబ్బంది అంజిరెడ్డి, గణేష్, హోంగార్డు బివి సుబ్బారెడ్డి, ఆటో డ్రైవర్లు, సుమో డ్రైవర్లు పాల్గొన్నారు.

మిడ్ డే మీల్స్ కార్మికుల జీతాలు పెంచండి



డీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న కార్మికులు

రాయచోటి అర్బన్ : మధ్యాహ్న భోజన పథకం (మిడ్ డే మీల్స్)లో పనిచేస్తున్న కార్మికులకు జీతం రూ. 10వేలకు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వరమ్మలు డిమాండ్ చేశారు. జీతాలు పెంచాలంటూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు గురువారం డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద పథకంలో పనిచేస్తున్న 55 వేల మంది పేద మహిళా కార్మికుల వేతనాలను, విద్యార్థుల మెస్ చార్జీలను తక్షణమే పెంచాలన్నారు. వంట చేసేందుకు అవసరమైన గ్యాస్‌ను ప్రభుత్వమే సబ్సిడీ కింద సరఫరా చేయాలన్నారు. పాఠశాలల్లో ప్రత్యేకంగా అమలు పరుస్తున్న రాగిజావకు ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయించాలంటూ కోరారు. మధ్యాహ్న భోజనం కార్మికులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించి, సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈ మేరకు డీఈఓ శ్రీరామ్ పురుషోత్తంకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, పట్టణ కార్యదర్శి పుల్లయ్య, నాయకురాళ్లు రెడ్డెమ్మ, ప్రమీల, అలివేలమ్మ, బీబీజాన్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ పరిశీలన



ఎన్ఆర్ పురం పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ మురళీకృష్ణ

పెనగలూరు (ఓబులవారిపల్లె) : రెవెన్యూ సిబ్బంది గురువారం మండలంలోని పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పరిశీలించారు. మండల వ్యాప్తంగా ఏడు బూత్‌లలో సౌకర్యాలు తక్కువ ఉన్నాయని, ఈ ఏడు బూతులలో సౌకర్యాలు మెరుగుపరిచే విధంగా చర్యలు ఇప్పటికే చేపట్టామని తెలియజేశారు. అలాగే ప్రధానోపాధ్యాయులతో కూడా చర్చించినట్లు ఆయన తెలిపారు.

నులిపురుగుల నిర్మూలనతోనే ఆరోగ్యం



అల్బెన్‌డజోల్ మాత్రలతో ఎంపీపీ బాబుల్ రెడ్డి, వైద్యాధికారులు

పుల్లంపేట : అల్బెన్‌డజోల్ మాత్రలతో నులిపురుగులను నివారించుకోవచ్చని ఎంపీపీ ముద్దా బాబుల్ రెడ్డి వెల్లడించారు. గురువారం ఎంపీపీ బాబుల్ రెడ్డి శుక్రవారం (నేడు) నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6 సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల వయస్సులోపు పిల్లలందరూ అల్బెన్‌డజోల్ మాత్రలను తినడం వలన కడుపులోని నులిపురుగులను నిర్మూలించవచ్చని తద్వారా ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. అల్బెన్‌డజోల్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కావున ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ సానే శేఖర్, డాక్టర్ మనోజం చంద్ర, తహసీల్దార్ నరసింహకుమార్, ఎంపీడీఓ నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారులకు ఈకేవైసీ తప్పనిసరి

రామాపురం : మండల పరిధిలోని శ్రీ ప్రభాకర్ ఇండియన్ గ్యాస్ వినియోగదారులందరూ కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ఈకేవైసీ తప్పకుండా చేయించుకోవాలని డిస్ట్రిబ్యూటర్ సి.వి.సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉచిత గ్యాస్ కనెక్షన్లను ఇచ్చిన దృష్ట్యా చాలా మందికి ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందజేశామని, అలాగే గ్యాస్ కావాలనుకునేవారు ముందుగా బుకింగ్ చేసుకున్నట్లయితే వారికి సకాలంలో గ్యాస్ అందిస్తామన్నారు. ఈకేవైసీ చేయించుకోవడం వల్ల ఎవరికైతే గ్యాస్ కనెక్షన్ ఉంటుందో వారికి కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఈ అవకాశాన్ని గ్యాస్ వినియోగదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయనతోపాటు గ్యాస్ మేనేజర్ వెంకట్రామిరెడ్డి, ఈశ్వరమ్మ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

డేటా ఎంట్రీలో శిక్షణ

మదనపల్లె : ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం ద్వారా మదనపల్లెలోని స్థానిక జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ కె.ఓబులేషు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. వివరాలకు 9553202509 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేద్దాం



పార్టీలోకి చేరిన వారితో బీజేపీ నాయకులు

రాయచోటి టౌన్ : రాయచోటి నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా పని చేద్దామని బీజేపీ నాయకులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం రాయచోటి ఎన్‌జీఓ హోంలో రాయచోటి అసెంబ్లీ కన్వీనర్ నిర్మల్‌కుమార్ ఆధ్వర్యంలో అసెంబ్లీ ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాబోయే ఎన్నికలలో జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్, జిల్లా ఇన్‌చార్జ్ చంద్రమౌళి నాయకత్వంలో పని చేయాలని రాయలసీమ కో కన్వీనర్ సామంచి శ్రీనివాస్ సూచించారు. ఎన్నికల మేనేజ్‌మెంట్ కమిటీలో భాగంగా 38 మందిని ఎంపిక చేశారు. అనంతరం చిన్నమండెం మండలం పడమటికోనకు చెందిన టీడీపీ నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు రేపన శివ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆనంద గజపతి రాజు, కృష్ణయాదవ్, అన్నమయ్య జిల్లా అధికార ప్రతినిధి పాలగిరి శ్రీనివాసకుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ ఎనర్జీ హార్వెస్టర్ ప్రాజెక్టుకు స్టార్ హోదా

మదనపల్లె సిటీ : జాతీయ స్థాయిలో ఈ నెల 6 నుంచి 8 వరకు నేషనల్ ఇన్నోవేషన్ కౌశిల్ నిర్వహించిన సైన్సు పోటీల్లో మదనపల్లె మండలం సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తయారు చేసిన గ్రీన్ ఎనర్జీ హార్వెస్టర్ ప్రాజెక్టుకు స్టార్ హోదా దక్కింది. జాతీయ స్థాయిలో జరిగిన పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి సుమారు రెండు వేల వరకు ప్రాజెక్టులు ప్రదర్శనలో పాల్గొన్నాయి. ఇందులో మొదటి 30 ప్రాజెక్టులకు స్టార్ హోదా ఇచ్చారు. ఇందులో సీటీఎం జెడ్పీ ఉన్నత పాఠశాల స్టార్ హోదాకు ఎంపికైంది. ఈ ప్రాజెక్టుకు పాఠశాల ఉపాధ్యాయుడు వేణుగోపాల్‌రెడ్డి గైడ్‌గా వ్యవహరించారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడంతోపాటు సాంకేతిక సాయం అందించనున్నట్లు ఎంహెచ్ఆర్‌డీ ప్రకటించారు. ప్రాజెక్టును విద్యార్థులు అభినయ్, శ్రావణ్, రోహిత్, రాయ్, ఉదయ్ తయారు చేశారు. వీరిని పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

అసత్య ప్రచారాలపై చర్యలు

కడప అర్బన్ : నగరంతో పాటు, సబ్ డివిజన్ పరిధిలో ఎవరైనా సరే సోషల్ మీడియాను వేదికగా చేసుకుని అసత్య ప్రచారాలను చేస్తే వారిపై చర్యలు తప్పవని కడప డీఎస్పీ ఎం.డి షరీఫ్ హెచ్చరించారు. గురువారం కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మీడియా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, ప్రజలు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. తాము చేసే ప్రచార సంఘటనల ద్వారా ప్రజలు భయాందోళనకు గురికాకుండా చూడాలని ఆయన సూచించారు.

రౌండ్ టేబుల్ సమావేశం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఈ నెల 16న బీజేపీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమం జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో వామపక్ష రైతు, కార్మిక సంఘాల నాయకులు రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం హామీలు అమలు పరచకుండా కార్మిక, రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ధ్వజమెత్తారు.